



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

టిడ్కో గతి మారేనా..?

- మౌలిక వసతులు కరువు
- నివాసానికి అననుకూల వాతావరణం
- ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై ఒత్తిడి



కర్నూలు జిల్లాలోని టిడ్కో గృహాల సముదాయం (ఫైల్)

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో అప్పటి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే లబ్ధిదారులు ఇళ్లలో చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో ఎలా నివాసం ఉండగలమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

రూ.7.87 కోట్లతో కాలుష్య నియంత్రణకు ఆమోదం

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కర్నూలు నగరంలో రూ.7.87 కోట్లతో కాలుష్య నియంత్రణకు వీలుగా అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలుకు కమిటీ ఆమోదం తెలిపింది. కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా కర్నూలు నగరంలో గాలినాణ్యత పెంచేందుకు వీలుగా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద గ్రీనరీ డెవలప్‌మెంట్, సర్కిల్స్ వద్ద వాటర్ ఫౌంటెయిన్, ఎండ్‌టుఎండ్ రోడ్ల చదును, జంక్షన్ అభివృద్ధి పనులను చేసి దుమ్ము, ధూళిని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్ విహార్ బస్ స్టాప్ దాకా ఉన్న రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. సి. క్యాంపు నుంచి విజ్ఞాన్ మందిర్ వరకు, విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి రైతు బజార్ వరకు, విజ్ఞాన్ మందిర్ నుంచి బి క్యాంప్ ఆటో స్టాండ్ వరకు కూడా ఇదే విధంగా రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. ఉల్చాల జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ప్లాంటేషన్ చేపట్టి, పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కిసాన్ నగర్ పార్కులో పచ్చదనం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిళ్లు, డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా పచ్చదనం పెంచేలా నిర్వహణ చేయాలన్నారు. ఎయిర్ క్వాలిటీ వివరాలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డులను నగరంలోని 3 ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలుష్య నియంత్రణకు వీలుగా పచ్చదనం అభివృద్ధి చేసేలా ప్రజలకు కూడా అవగాహన కలిగించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ పి.వెంకట కిషోర్ రెడ్డి, డిటిసి శాంత కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

కెవిఆర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సు కు ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి , శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం. వెంకటహరినాథ్ మాట్లాడారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చట్ట రీతానేరమని తెలిపారు. ఏస్కాన్ సెంటరయినా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారికీ శిక్ష తప్పదని తెలిపారు. మహిళల హక్కులు రక్షణ , నిబంధనలను ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి. శాంతికళ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కన్సల్టెంట్ , న్యాయవాది సుమలత, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ దేవికారాణి, ఎన్‌జిఒ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.లీలకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలవెంకట శేషాద్రి



జిజిహెచ్‌లో ఏర్పాటుచేసిన హెచ్‌ఎంపివి వైరస్ వార్డును పరిశీలిస్తున్న వైద్యుల కమిటీ

హెచ్‌ఎంపివి వైరస్ విభాగం ఏర్పాటు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ గైనిక్ విభాగంలో 20 పడకల హెచ్‌ఎంపివి వైరస్ విభాగం ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... హెచ్‌ఎంపివి వైరస్ ప్రాణాంతక మైంది కాదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ గైనిక్ విభాగంలో 20 పడకలతో అన్ని సదుపాయాల తో హెచ్‌ఎంపివి వార్డు ఏర్పాటు చేసామన్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌ఫర్ట్ కమిటీ వైద్యులు ఆరుగురితో ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో మైక్రో బయాలజీ హెచ్‌ఒడి డాక్టర్ రేణుకాదేవి, ఎస్‌పిఎం డిపార్టుమెంట్ హెచ్‌ఒడి డాక్టర్ సుధా కుమారి, పీడియాట్రిక్ హెచ్‌ఒడి డాక్టర్ విజయనంద్ బాబు, జనరల్ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, పల్మనాలజీ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ శ్రీకాంత్, అనస్తీషియా హెచ్‌ఒడి డాక్టర్ విశాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామని తెలిపారు. కేసుల దృష్ట్యా ఆస్పత్రిలోని హెచ్‌ఎంపివి వైరస్‌ను ఎదుర్కోవడానికి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎలాంటి హెచ్‌ఎంవివి వైరస్ కేసు నమోదు కాలేదని అని అన్నారు. ఆసుపత్రిలో హెచ్‌ఎంపివి వైరస్‌పై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పల్మోనాలజీ, అనస్థీషియా, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, ఎస్‌పిఎం, పీడియాట్రి ఫ్యాకల్టీతో కూడిన ఎక్స్‌ఫర్ట్ కమిటీ టీంను రెడీ చేసి, ఫ్యాకల్టీ వైద్యులు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ప్రతి ఒక్కరూ మాస్కులు, శానిటైజర్లను ఉపయోగించాలని కోరారు. అనంతరం వీలైనంతవరకు ఈ వైరస్ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

అభివృద్ధి పట్టని మోడీ గోబ్యాక్

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోసగించారు

- కలెక్టరేట్ ఎదుట సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల మోడీ అనుసరిస్తున్న తీరు సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ విమర్శించారు. చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ కూడా ప్రజలను మోసగించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్టని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ.. సిపిఎం రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఎం కర్నూలు జిల్లా కమిటి ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణం నుండి రాజ్‌విహార్, మెడికల్ కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ముందు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విభజన హామీలు అమలు చేయాలి, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టదా, మోడీ గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినదించారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి నిర్మల, టి.రాముడు మాట్లాడారు. అభివద్ధి పనుల ప్రారంభోత్సవం పేరుతో రేపు రాష్ట్రానికి రాబోతున్న నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికలకు ముందు విభజన హామీలను అమలు చేస్తామన్న హామీతో బాబుమోడీ జోడి ప్రజల ముందుకు వచ్చి అధికారాన్ని కైవసం చేసుకున్న తర్వాత 11 ఏళ్లు అయినా హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. నాడు రాజధాని శంకుస్థాపన కోసమని వచ్చి చెంబడు నీళ్లు పిడికెడు మట్టి వేసి వెళ్లారని, హామీల అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అప్పిచ్చే స్థాయికి ఎదిగిన విశాఖ ఉక్కును, గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టి, ప్రైవేట్ కార్పొరేట్ల ఆదాయ వనరు కోసం ఏకంగా మూసివేతకు ప్లాన్ వేసిందన్నారు. విశాఖ ఉక్కు రక్షణ పట్ల స్పష్టత ఇవ్వాలన్నారు. వెనకబడ్డ రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి ప్రాజెక్టులు నిర్మించాల్సిన పాలకులు ఒక్కటంటే ఒక్కటి కూడా నిర్మించలేదన్నారు. తిరిగి నేడు కూటమి ప్రభుత్వంలో భాగంగా చంద్రబాబు మోడీలు జోడి గానే ఉన్నారని, రాష్ట్ర వెనుకబాటు తనానికి సంబంధించి చంద్రబాబు కూడా సమాధానం చెప్పాలన్నారు. రూ.142 కోట్ల జనాభా ఉన్న భారతదేశానికి రూ.165 లక్షల కోట్ల అప్పులు పెట్టి దేశాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. చేసిన అప్పు అంతా ఏ అభివృద్ధి కోసం ఖర్చు చేశారో ప్రజానీకానికి సమాధానం చెప్పాలన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం, వలసల నియంత్రణ లాంటి వాటిపై దృష్టి పెట్టకుండా మాటల గారడీ మాకొద్దని ముక్తకంఠంతో మీ రాకను వ్యతిరేకిస్తున్నా మన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించకపోతే ప్రజలంతా ఐక్యంగా తిరగబడే రోజు మరెంతో దూరంలో లేదని హెచ్చరించా రు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కె.వెంకటేశులు, కెవి.నారాయణ, ఎండి.ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, అరుణ, నగేష్, గురుశేఖర్, విజయ్, లింగన్న, వీరశేఖర్, హనుమంతు, నాగన్న, బాలకృష్ణ, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, నగరాల కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, నరసింహులు సుధాకరప్ప, షరీఫ్, రామకృష్ణ, అబ్దుల్లా ,ప్రభాకర్ మరో 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పక్షపాతం లేని పారదర్శకపాలన

-అందరి సహకారంతో ముందడుగు

-మూడేళ్లు పూర్తి చేసుకున్న జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



అందరి సహాయ, సహకారాలతో, ఆధరాభిమానాలతో, రాష్ట్రంలోని ఎంతో ప్రాముఖ్యత కలిగిన కర్నూలు జిల్లా ప్రజా పరిషత్తు అధ్యక్షులుగా 2022 జనవరి ఒకటిన పదవీ బాధ్యతలు చేపట్టి నేటికి మూడేళు పూర్తయిందనిని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు అత్యంత పారదర్శకంగా, అవినీతికి, ఆశ్రిత పక్షపాతంకు చోటివ్వకుండా, స్వచ్ఛమైన పాలన అందించడం ద్వారా తమపై పెద్దలు పెట్టుకున్న విశ్వాసానికి, నమ్మకానికి ఏ మాత్రం వమ్ము చేయకుండా సాగించానని కితాబు ఇచ్చుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి సహకారంతో ఉన్నతమైన ఆలోచన ఆచరణతో మూడేళ్ళ పాలన విజయవంతంగా సాగిందన్నారు. 60 సిపిడబ్ల్యుఎస్ పథకాల ద్వారా కర్నూలు-నంద్యాల జిల్లాలో 663 హ్యాబిటేషన్లకు సురక్షితమైన తాగునీరు అందించామన్నారు. వీటి నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించమన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. 64.42 కోట్ల మేర, 2022-23 లో రూ.73.82 కోట్ల మేర, 2023-24లో రూ.73.20 కోట్ల మేరకు 2024-25లో రూ.85.71 కోట్ల మేర పథకాల నిర్వహణకు పరిపాలనా ఆమోదానికితీర్మానం చేశామన్నారు. మూడేళ్ల కాలంలో 99 పనులు చేపట్టి 72 పనులు రూ. 4,11,46,528 ఖర్చు చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం కింద 2021-22, 2022-23, 2023-24 మరియు 2024-25 ఆర్థిక సంవత్సరములందు రూ.89.15 కోట్ల మేరకు గ్రాంటు విడుదల అయిందన్నారు. 2021 -22 లో రూ.10 కోట్ల 30 లక్షలు, 2022 - 2023 లో రూ.12 కోట్ల 17 లక్షలు, 2023 - 2024 లో రూ.11 కోట్ల 41 లక్షలు, 2024 నుండి 2025 నేటివరకు రూ.11 కోట్ల 44 లక్షల ఆదాయాన్ని జిల్లా పరిషత్ పొందిందని తెలిపారు. గతంతో పోల్చితే ఈ మూడేళ్ళలో రెట్టింపు ఆదాయానికి జిల్లాపరిషత్ అధికారులు, జడ్‌పిటిసిలు అందరి ఆలోచనలు సహకారంతో సాధించామని తెలిపారు. ఉదాహరణగా ఒక్కటి యాడ్స్‌కు సంబంధించిన హోర్డింగ్స్‌కు గతంలో అడుగు రూ.36 రూపాయలు తీసుకునేవాళ్ళు ఇప్పుడు రూ.196 అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇలాంటి ఎన్నో ఆలోచనలతో ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్థాయి సంఘాల్లో, సర్వసభ్య సమావేశాల్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రతి సమస్యకు పరిస్కారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ముఖ్యమైన శాఖతో ఎప్పటికప్పుడు చర్చించి తగిన ప్రణాళిక ద్వారా సమస్యలను అధిగమించమన్నారు. జడ్‌పిటిసిల గౌరవవేతన నిధులు మంజూరు అయ్యాయని వారికి కూడా చెల్లింపులు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, జడ్‌పిటిసిలు అధికారులు మీడియా మిత్రులు అందరి సహకారం ఇలాగే అందించాలని సవినయంగా కోరుతున్నామని తెలిపారు. గూడూరు జడ్‌పిటిసి మౌలాలి, జూపాడుబంగ్లా జెడ్పిటిసి జగదీశ్వరెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యుఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న దివాకర్, రాముడు, అంజిబాబుం

ఆర్‌టిసి పరిరక్షణకు పోరాటం

డైరీ ఆవిష్కరణ సభలో నాయకులు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి రంగ పరిరక్షణ కోసం పోరాడుదామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, స్టాఫ్‌అండ్‌వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కార్యదర్శి రాయుడు పిలుపునిచ్చారు. కర్నూలు కార్మిక కర్షక భవన్లో ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ 2025 సంవత్సరపు నూతన డైరీని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆర్‌టిసి పరిరక్షణ కోసం ప్రతి కార్మికుడు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. చాపకింద నీరులా ఆర్‌టిసి ప్రైవేటు వరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హైర్ బస్ రూపంలో ప్రైవేటీకరణ జరిగిందని, మళ్లీ ఇప్పుడు ఎలక్ట్రిక్ బస్సుల రూపంలో మరింత ప్రైవేటీకరణ చేయడం కోసం ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించే విధంగా ఒత్తిడి తీసుకొని రావడానికి అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్‌టిసిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. వారికి పని భద్రత లేదని, ఆర్‌టిసిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు అభద్రతాభావంలో ఉన్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల అందరినీ రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. రాబోవు కాలంలో ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు.



బురాన్ దొడ్డిలో ఉచితవైద్య శిబిరం

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం బురాన్ దొడ్డిలో అమిలీయో ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ఇంచార్జి వరప్రసాద్ అధ్యక్షతన గైనకాలజిస్ట్ లక్ష్మిప్రసన్న, జనరల్ వైద్యులు రమాదేవిలు పలువురికి పరీక్షలు చేయించి మందులు ఉచింతంగా అందించారు. గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, స్త్రీ వ్యాధి సమస్యలు, కంటి జబ్బులపై ప్రత్యేక అవగాహన కల్పించి ఆందోళన కర రోగులను ఆసుపత్రికి రిఫరల్ చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీకల్ కళ్యాణి, అప్తాలజిస్ట్ చంద్ర హాస్ తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి చిన్నహుల్తి దగ్గర దుస్థితి

రోడ్డు మరమ్మతులో నాణ్యత లోపం

నిద్రావస్థలో ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రోడ్లు గుంతలను మరమ్మతులు చేసి ప్రజలకు సంక్రాంతి పండుగ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని చెబుతుంది. పత్తికొండ మండలం ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి చిన్నహుల్తి గ్రామం దగ్గర తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నట్లు అక్కడ కనిపిస్తున్న రోడ్డు మరమ్మతులు నిదర్శనమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతు నాణ్యత పూర్తిగా లోపించడంతో అక్కడ వేసిన తారు పూర్తిగా లేచిపోవడంతో గుంతలు గుంతలుగా ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కుతోనే నాణ్యతతో లోపించిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులను పూర్తిస్థాయి నాణ్యతతో పనులు చేపట్టాలని కోరుతున్నారు.

జయరాజ్ కార్మికులకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జయరాజ్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కార్మికులను జీతాలను వెంటనే మంజూరు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటి యు మండల నాయకులు వి.సుధాకర్ మంగళవారం జయరాజ్ స్టీల్ ప్లాంట్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం గ్రామస్తులు రైతులు చదువుకున్న యువతతో పరిశ్రమ ముందు ధర్నా చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో స్థానిక యువతకు 100 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఒకటో తారీకు దాటి 7 రోజులు అయిపోయినా ఇంతవరకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమైన విషయమన్నారు. జీతం రూ.15,000 వేలు అయితే వాటిలో రూ. 3నుంచి4 వేల వరకు కటింగ్ చేసి రూ.11నుంచి 12 వేలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం ఉన్నతాధికారులు స్పందించి మూడో వ్యక్తి ద్వారా ఉద్యోగాలు కాకుండా కంపెనీనే డైరెక్టుగా ఉద్యోగాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మికులకు జీతాలు మంజూరు చేసి వారికి రావడానికి పోవడానికి బస్సులు ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జయరాజ్ ఇస్పాత్ కార్మికులతో నాగన్న, సుధాకర్ తదితరులు

జలుబు, ఫ్లూ లక్షణాలుండే వైరస్ హెచ్‌ఎంపివి

డాక్టర్ సువర్ణలక్ష్మీ సలహాలు సూచనలు



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : హ్యూమన్ మెటాప్న్యూమో వైరస్(హెచ్‌ఎంపివి) ఇతర శ్వాసకోశ వైరస్ లాగా సాధారణ జలుబు , ఫ్లూ వంటి లక్షణాలు కలిగిస్తుందని కర్నూలు మెడికవర్ పల్మనరీ మెడిషన్ డాక్టర్ సువర్ణలక్ష్మీకల్ల తెలిపారు. దీనిని 2001 లోనే కనుక్కున్నారని అన్నారు. ఎక్కువగా భయపడాల్సిన అవసరం కూడా ఏమి లేదన్నారు. పిల్లలో , వృద్ధులో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్ళకి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వీటి లక్షణాలు దగ్గు, జ్వరం, ముక్కుకారడం, గొంతునొప్పి సాధారణ లక్షణాలన్నారు. కొంత మందిలో బ్రోన్‌కైటిస్, న్యుమోనియా కూడా రావచ్చున్నారు. హెచ్‌ఎంపివి నుంచి తెసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను సూచించారు. మాస్క్ వేసుకోవడం, చేతులను సబ్బుతో కడుక్కోవడం, ముఖాన్ని తరచుగా తాకకుండా ఉండడం, రద్దీగా ఉండే ప్రదేశాలనుంచి దూరంగా ఉండడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'ఉపాధి'లో రాజకీయ జోక్యం నివారించాలి

- ప్రజాసంఘాల నాయకులు, ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


అధికారులతో మాట్లాడుతున్న కూలీలు

మండలంలోని పాండవ గల్లు గ్రామంలో ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని ప్రజాసంఘాల నాయకులు, ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధి కూలీలు ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, సిఐటియు నాయకులు పాండురంగ, వ్యకాస మండల నాయకులు గోవిందు, కృష్ణ, హుస్సేని మాట్లాడారు. మండలంలోని పాండవగల్లు గ్రామంలో సుమారు 300 మందికి పైగా కూలీలకు ఉపాధి పనులు రోజూ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మ ఆధ్వర్యంలో చేస్తున్నారని తెలిపారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే కూలీలకు ప్రత్యేకంగా మస్టర్ కావాలని రాజకీయంగా ఎంపిడిఒపై ఒత్తిడి తీసుకొచ్చి 120 మంది పని చేస్తున్న వర్క్ ఐడి నెంబర్ కేటాయించడం వల్ల ప్రస్తుతం పని లేకుండా పోయిందని చెప్పారు. కూలీలు గత వారంలో చేసిన వర్క్ ఐడిని వేరే వారికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. గతంలో చేసిన పని కూలీలకే కేటాయించాలని, రాజకీయ నాయకుల జోక్యం నివారించాలని కోరారు. ఇన్ఛార్జీ ఎపిఒ సూర్యప్రకాష్ జోక్యం చేసుకొని ఆ వర్క్ ఐడిలో ఎవరికి పని కల్పించబోమని, వచ్చేవారంలో అందరికీ పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కూలీలు మాట్లాడుతూ... ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మ ఆధ్వర్యంలోనే అందరికీ పనులు కల్పించాలని, లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

సోషల్ మీడియాలో ప్రచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - నందవరం


ఫిర్యాదు చేస్తున్న పుష్పావతి, నాగరాజు గౌడ్

తమపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నందవరం పోలీసు స్టేషన్లో జడ్పి మాజీ వైస్ చైర్మన్ పుష్పావతి, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు గౌడ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి తమ కుటుంబం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కొంతమంది తమపై అసత్యాలు ప్రచారం చేస్తూ బురద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత వారం రోజులుగా గోనెగండ్ల ప్రాంతంలో అనవసరంగా పాత వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, వాటికి, తమకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. అధిష్టానం, ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్రెడ్డి ఎవరికి పదవులు ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. రాజకీయాల్లో తమను ఇబ్బందులకు గురి చేయాలని కొందరు నిత్యం అబద్దాలు ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. అసత్యాలకు అడ్డుకట్ట వేయాలని, లేకపోతే జిల్లా అధికారులకు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పాఠశాల మైదానంలోకి మురుగునీరు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, యువకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల


మురుగు నీటిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిలిచి, గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోకి చేరింది. గోనెగండ్లలో ఉన్న బ్రాహ్మణ కాలనీ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మురుగునీటి కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు, ఖాళీ మద్యం సీసాలు పేరుకుపోయాయి. మురుగు ముందుకు వెళ్లకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి చేరుతోంది. ఈ నీటి నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల మైదానంలో ఉదయం పూట నడక కోసం వచ్చే వాకర్లతో పాటు వివిధ ఉద్యోగాల సన్నద్ధత కోసం ప్రాక్టీస్ చేసే యువకులు ఇబ్బంది పడుతున్నారు. మైదానంలో ఆటలు ఆడుకోవడానికి విద్యార్థులు దుర్వాసన, మురుగునీరు చేరి తడిగా ఉండడంతో క్రీడా సమయంలో ఆడుకోలేకపోతున్నారు. మైదానంలోకి చేరిన మురుగునీటిని జనసేన నాయకులు గానిగ బాష, మాలిక్ మంగళవారం పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రతను పునరుద్ధరించాలని కోరారు.

వేసవి రాకముందే..!

- శీతాకాలంలోనే నీటి కష్టాలు - వేసవిని తలపిస్తున్న ఎద్దడి
- తాగునీటి ఎద్దడికి ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే కారణం
- సురక్షిత నీరందించడంలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - నందవరం

వేసవి రాకముందే గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. శీతాకాలంలోనే గ్రామంలో వేసవి కష్టాలు కనిపిస్తున్నాయి. గ్రామంలో సురక్షిత తాగునీటిని అందించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. తాగునీటి ఎద్దడికి ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

తాగునీటి కష్టాలతో నందవరం గ్రామం వేసవి తాపాన్ని తలపించే విధంగా తయారైంది. గ్రామంలో ఎటు చూసినా నీటి దాహంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎస్సీ కాలనీలో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. నీటి కోసం ప్రజలు తెల్లవారుజాము 3 గంటలకే కుళాయిల దగ్గర పడిగాపులు కాస్తున్నారు. నీరు దొరకక చాలామంది కిలోమీటరు మేర నడిచి వెళ్లి నీటిని తెచ్చుకునే దుస్థితి ఏర్పడింది. సర్ల వీధి, రామలింగేశ్వర దేవాలయం వీధుల్లో ఉదయం 6 గంటల నుంచి కుళాయిల దగ్గర నీరు దొరకక మహిళలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. బీసీ కాలనీలో నీరు దొరకక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో రెండు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి. అది కూడా కొద్ది సమయం మాత్రమే వస్తాయి. అధికారులను అడిగితే చెరువులో నీరు లేవని సమాధానం చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

తాగునీటి ఎద్దడికి ప్రజా ప్రతినిధులు, అధికారులే కారణం

గ్రామంలో చాలాచోట్ల చాలామంది వ్యక్తులు, పార్టీల కార్యకర్తలు ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా పైపులకు బొక్కలు వేసి కుళాయిలను వేసుకున్నారు. దీని కారణంగా గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. వీటిని ఖండించాల్సిన ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం వల్లే గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో చాలా చోట్ల పబ్లిక్ కుళాయిలకు ఆన్, ఆఫ్ లేక నీరు వృథాగా వెళ్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా కొన్ని కుళాయిలు మరమ్మతులకు నోచక నీరు వృథాగా పోతోంది. గ్రామంలో కొన్నిచోట్ల పైపులు లీకై నీరు వృథా అవుతోంది. నెలలు గడిచినా అధికారులు మాత్రం ఆ సమస్యలను పట్టించుకోవడం లేదు. చాలా విధాలుగా నీరు వృథాగా వెళ్తున్నా వీటిని అరికడితే కనీసం కొద్దిగైనా నీటి సమస్య తీరుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.


నీటి కోసం పడిగాపులు కాస్తున్న గ్రామస్తులు

సురక్షిత నీరందించడంలో అధికారులు విఫలం

మూడు నెలల కిందట జల జీవన్ మిషన్ పనులు చేస్తున్న సమయంలో పైపు పగిలిపోయింది. అక్కడ పైపు పగిలిపోయి నీరు ఆగి గుంత పడింది. ఆ బురద వల్ల నీరు కలుషితమై వీధిలో ఉన్న కుళాయిలకు వెళ్తున్నాయి. మూడు నెలలుగా ఈ నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మూడు నెలలైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించడం లేదు. గ్రామానికి నీరు సరఫరా అయ్యే చెరువును అధికారులు తూతూమంత్రంగా సందర్శిస్తున్నారు. పరిశుభ్రత వారికి పట్టడం లేదు. నెలలో ఒకసారైనా అధికారులు బ్లీచింగ్ పౌడర్ను నీటిలో వేయిస్తున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి నీరు సరఫరా అయ్యే చెరువు ప్రదేశంలో ఉన్న కుంట అధ్వానంగా ఉంది. అందులో పిచ్చి మొక్కలు భారీగా మొలిచి ఉన్నాయి. కుంట మొత్తం పాచితో, బురదతో నిండిపోయింది. ఈ అపరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారు.


పిచ్చి మొక్కలు, పాచితో నిండిన కుంట

అక్రమ రిజిస్ట్రేషన్ కేసు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్కు పంపామని ఆదోని టూ టౌన్ సిఐ సూర్య మోహన్ రావు మంగళవారం తెలిపారు. బతికున్న మనిషిని చనిపోయాడని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటన గతనెల 31న చోటుచేసుకుంది. ఈనెల 4న ఘటన వెలుగులోకి వచ్చింది. విచారించిన పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే కార్యాలయ ఉద్యోగులు ఈరన్న, రమేష్, డాక్యుమెంట్ రైటర్లు మాబు, షఫీర్, సాక్షి సంతకం పెట్టిన ఇలియాస్ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

- అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా బాగా చదువుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి సూచించారు. బనవాసి గురుకుల కళాశాలలో విద్యార్థినిపై దాడి ఘటనపై మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి విద్యార్థిని, ఉపాధ్యాయులతో, కళాశాల హాస్టల్ పరిస్థితులు, సమస్యల గురించి విచారణ చేపట్టారు. గత ప్రిన్సిపల్ చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్ర బాబు, విజేంద్ర, ఉదయ్, వీరేష్ యాదవ్, సురేంద్ర బాబు, హుస్సేన్ వినతిపత్రం అందజేశారు.

సామాజిక స్పృహ కలిగి ఉండాలి

- బాధ్యత గల పౌరులుగా లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు

- డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులు సామాజిక కలిగి ఉండాలని, పట్టణానికి చెందిన లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా ఉన్నారని సామాజికవేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు తెలిపారు. మంగళవారం లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం మణి మాధురి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులతో పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, మాచాని సోమప్ప సర్కిల్, వివిధ సర్కిళ్లలో ర్యాలీ నిర్వహించారు. సోషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ అంటే... మొబైల్స్ ఎక్కువ వాడడం వల్ల నష్టాలు, మొబైల్ను మితంగా ఏ విధంగా వాడాలి, హెల్మెట్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు, రాష్ డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు, ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ ద్వారా నష్టాలు, మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే నష్టాలు, పౌరుల సామాజిక బాధ్యతల గురించి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడారు. లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం, మాధురి వారి బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు ఇలాంటి అద్భుతమైన, మంచి సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని చెప్పారు. లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు సమాజంలో సామాజిక స్పృహ కలిగిన భవిష్యత్తు పౌరులని కొనియాడారు. సమాజంలో యువత వ్యసనాలకు లోనై, మొబైల్స్ వాడకంలో కానీ, హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లకు గురవుతూ, సమాజంలో ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కార్యక్రమాలకు బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు ప్రజలను మేల్కొల్పే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషమని, మానవత్వం గల విద్యార్థులని చెప్పారు. విద్యార్థులను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దే లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యానికి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.


ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆల్ఫ్రెడ్ రాజు

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

- తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి - కౌతాళం


మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ను పరిశీలిస్తున్న అధికారులు, ఛైర్మన్ టిప్పు సుల్తాన్

తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేసిన రైతులకు సాగునీరందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు కోరారు. మంగళవారం మండలంలోని కామవరం గ్రామం వద్ద దిగువ కాలువపై ఎల్ఎల్సి అధికారులతో సాగునీటి సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుంగుభద్ర కాలువపై మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ను అధికారులు, ఛైర్మన్ టిప్పు సుల్తాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంటలు బాగా పండాలంటే వారికి కావాల్సినంత సాగునీటిని సకాలంలో అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. ఎల్ఎల్సి డిఇ మహ్మద్ షఫీవుల్లా మాట్లాడుతూ... వివిధ డిస్ట్రిబ్యూటర్ల కింద కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు, రైతులు సమన్వయంతో సాగునీరు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా వివిధ కాలువల కింద వంతుల వారీగా సాగు నీటిని వినియోగించుకుని రైతులందరికీ సాగునీరందేలా పని చేద్దామని చెప్పారు. జెఇ ఈశ్వర్, వర్క్ ఇన్స్పెక్టర్లు పీర్ సాబ్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలి

- స్టైఫండ్ అకౌంట్లో జమ చేయని వైనం

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న

ప్రజాశక్తి - ఆదోని

కుల వృత్తి చేసుకునేందుకు వీలుగా ప్రతి గ్రామంలోనూ రజకులకు దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలని, శిక్షణకు హాజరైన వారికి స్టైఫండ్ మొత్తం అకౌంట్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం నూతన క్యాలెండర్ను ఆవిష్కరించి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కన్న, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉరుకుందు, ఆదోని పట్టణ అధ్యక్షులు రామన్న మాట్లాడారు. రాష్ట్రంలో రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని, కార్పొరేషన్కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించి రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ దోభీ ఘాట్లు ఏర్పాటు చేసి పని చేసేందుకు వీలుగా నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. జిఒ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మోడ్రన్ దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, నిరోధించేందుకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి కౌసల్య విశ్వకర్మ ద్వారా జిల్లాలో దాదాపు 5 వేల మంది రజకులకు వారం రోజులు పాటు శిక్షన ఇచ్చారని తెలిపారు. శిక్షణలో రోజుకు రూ.500 చొప్పున వారం రోజులపాటు రూ.4 వేలు అకౌంట్లో జమ చేస్తామని చెప్పారని, రెండు నెలలైనా ఇంతవరకు అకౌంట్లో జమ కాలేదని చెప్పారు. శిక్షణకు హాజరైన వారందరికీ రూ.4 వేలు జమ చేయాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రజక సంఘం పట్టణ ఉపాధ్యక్షులు నాగప్ప, రవి, పట్టణ నాయకులు మల్లప్ప, పెద్దతుంబలం మహేష్, చిన్నహరివాణం భీమలింగ, బదినేహాల్ మహేష్, రవి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముక్కన్న

అద్దె చెల్లించకుంటే సీజ్ చేస్తాం

- డిఎస్ఒ భూపతి

ప్రజాశక్తి - ఆలూరు


దుకాణ దారులతో మాట్లాడుతున్న డిఎస్ఒ భూపతి

ఆలూరు ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న 6 దుకాణాలకు అద్దె బకాయిలు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేస్తామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ భూపతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ దుకాణాల సముదాయ వ్యాపారులతో ఆయన మాట్లాడారు. 6 దుకాణాలకు సంబంధించి రూ.10 లక్షల వరకు అద్దె బకాయి ఉందన్నారు. గతంలో హెచ్చరించినా అద్దె చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దుకాణదారులు అద్దె చెల్లించకపోతే దుకాణాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెరుగైన విద్యావ్యాప్తికి కృషి

- ఆదోని విద్యావేత్త దుర్గేష్కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఆదోని


డాక్టరేట్ పొందిన దుర్గేష్

సాయి భారతి విద్యాసంస్థల ద్వారా మెరుగైన విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నామని, తమ సేవలకు గుర్తింపు రావడం హర్షణీయమని దుర్గేష్ తెలిపారు. ఆదోనిలోని ఎస్కెడి కాలనీలో సాయి భారతి విద్యాసంస్థలను స్థాపించి విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న విద్యావేత్త బీసీ.దుర్గేష్కు అంతర్జాతీయ గౌరవం లభించింది. డే స్ప్రింగ్ తీయాలజికల్ యూనివర్సిటీ టెక్సాస్ (యుఎస్ఎ), గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూయార్క్ (అమెరికా) సంస్థలు ఆయన విద్యాసేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. సోమవారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ గౌరవం దక్కిందని ఆయన మీడియాకు తెలిపారు. డాక్టరేట్ రావడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని దుర్గేష్ తెలిపారు. పిన్న వయస్సులోనే అరుదైన గౌరవం పొందిన దుర్గేష్కు మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - మంత్రాలయం

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలోని కొత్త రాంపురం గ్రామానికి చెందిన తెలుగు తిమ్మేష్ కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక హెలిప్యాడ్ గ్రౌండ్ వద్ద తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి 120 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు.

డీలర్ల నియామకం జాప్యం

- రాజకీయ జోక్యమే కారణమా..?

- ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆదోని

చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకం పారదర్శకంగా జరుగుతుందని అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటగానే మిగులుతున్నాయి. దుకాణాల కేటాయింపుల్లో కూడా రాజకీయ జోక్యం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఆదోని నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి నాయకులు మూడు భాగాలుగా డీలర్ల పోస్టులు దక్కించుకున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రాజకీయ జోక్యం ఉండదని, పారదర్శకంగా జరుగుతుందని ఉన్నతాధికారులు ప్రకటన చేశారు. ఇది నిజమని నమ్మి చాలామంది నిరుద్యోగులు డీలర్ల నియామకం కోసం వందలాది రూపాయలు ఖర్చు చేసి దరఖాస్తులు చేసుకున్నారు. పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందినా ఇంటర్వ్యూలు వాయిదా వేస్తూ కారణాలు చెబుతుండడం పలు అనుమానాలకు తావిస్తోందని అభ్యర్థులు వాపోతున్నారు.


పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని 78 డీలర్ల నియామకం కోసం గతేడాది డిసెంబర్ 22న సబ్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణలైన వారు డిసెంబర్ 30, 24లోపు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. పరిశీలన అనంతరం అర్హులైన 472 మందికి హాల్ టికెట్లు జారీ చేశారు. ఈనెల 5న రాత పరీక్ష నిర్వహించారు. 458 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అందులో అర్హత మార్కులు పొందిన 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు పిలుస్తామని తెలిపారు. ఈనెల 6న సోమవారం ఇంటర్వ్యూ ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఉన్నపలంగా ఇంటర్వ్యూను రద్దు చేయడంతో ఎక్కువ మార్కులు పొందిన వారు నిరుత్సాహానికి గురవుతున్నారు.

రాజకీయ జోక్యం

ఎక్కువ మార్కులు సాధించిన వారిలో తమ వారు లేరని, ఇలా అయితే నాయకులు, కార్యకర్తలు నష్టపోతారని నాయకులు రంగప్రవేశం చేశారు. ఇంటర్వ్యూలు వాయిదా వేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. రాజకీయ జోక్యంతో తక్కువ మార్కులు వచ్చిన వారికి డీలర్ల ఎంపిక జరిగే అవకాశం ఉందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో టిడిపికి 12, బిజెపి 5, జనసేనకు 5 చొప్పున డీలర్ల కేటాయింపు జరగాలని ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇలా అయితే రాజకీయంగా పలుకుబడలేని అర్హులైన వారికి మొండిచేయి చూపే అవకాశం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. డీలర్ల ఎంపిక పారదర్శకంగా జరగాలని, లేకపోతే ఆందోళన చేస్తామని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

నిరుద్యోగులను మోసం చేయొద్దు

- వీరేష్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు, ఆదోని.



డీలర్ల నియామకం పారదర్శకంగా చేపడతామని అధికారులు ప్రకటన చేయడంతో నిరుద్యోగులు హర్షించారు. ఎక్కువ మార్కులు సాధించినా రాజకీయ జోక్యంతో మొండి చేయి చూపే అవకాశం ఉంది. ఇలా అయితే ప్రభుత్వ ఆశయం నీరు గారే ప్రమాదం ఉంది. అర్హులైన వారికి అన్యాయం జరిగితే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తాం. వాయిదా వేయకుండా వెంటనే డీలర్ల నియామక ప్రక్రియను కొనసాగించి అర్హులకు న్యాయం చేయాలి.

బదిలీ ఫార్మాసిస్టుకు సన్మానం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత మూడేళ్లుగా ఫార్మాసిస్ట్ విధులు నిర్వహించిన బాషావలీ ఎమ్మిగనూరుకు బదిలీపై వెళ్లిన సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశాలు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉండి మందులను సక్రమంగా సరఫరా చేయడం ద్వారా అందరి మన్ననలు పొందారని కొనియాడారు. యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సిబ్బంది భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, రంగస్వామి, హనుమంతమ్మ, శ్రీధర్, మెడికల్ ఆఫీసర్లు కల్యాణ్, వెంకటేశ్వర సన్మానించారు.


సన్మానం చేస్తున్న వైద్య సిబ్బంది

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ నుంచి కమిటీ వరకు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే సర్కిల్లో గల అన్నా క్యాంటీన్లో అల్పాహారం పంపిణీని తనిఖీ చేశారు. పరిశుభ్రతను నిర్వహించాలని సూచనలు చేశారు.

రెవెన్యూ సదస్సుకు 3 దరఖాస్తులు

- డిప్యూటీ తహశీల్దార్ సరస్వతి

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్ సరస్వతి

మండలంలోని వగరూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో రైతుల నుంచి 3 దరఖాస్తులు వచ్చినట్లు సర్వే విభాగం డిప్యూటీ తహశీల్దార్ సరస్వతి తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. విఆర్ఒలు ఆనందం, ప్రభాకర్, సర్వేయర్ రాధమ్మ పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం పోటీ పడి చదవాలి

- జగద్గురు ఖాదర్ లింగస్వామి ధర్మకర్త మున్నా పాషా

ప్రజాశక్తి - కౌతాళం

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, పోటీ ప్రపంచంలో పోటీపడి చదువుకోవాలని శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ధర్మకర్త మున్నా పాషా, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, వెంకటపతి రాజు, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, దాట్ల సుబ్బరాజు, బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సర్పంచి పాల్ దినకరన్ పేర్కొన్నారు. మంగళవారం జెకెఎల్ఎస్ స్కూల్లో పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఎదగాలని, భవిష్యత్తు విద్యార్థులదేనని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా జెకెఎల్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ లింగన్న ఇంత పెద్ద స్కూల్ను స్థాపించి విద్యార్థులు భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడుతూ స్కూల్ను అంచెలంచెలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు.





విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

అక్రమ రిజిస్ట్రేషన్పై నిగ్గు తేల్చాలి

- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని



అక్రమ రిజిస్ట్రేషన్కు పాల్పడిన వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని జనసేన ఇన్ఛార్జీ మల్లప్ప కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూములపై అక్రమార్కుల కన్ను పడిందని తెలిపారు. 6.51 ఎకరాల భూమిని ఎలాగైనా దోచుకోవాలని కుట్రపూరితంగానే అక్రమ రిజిస్ట్రేషన్కు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. దీనిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని, అప్పుడే నిజమైన అక్రమార్కులపై చర్యలకు ఆస్కారం ఉంటుందని, ప్రజలకు ప్రభుత్వంపై భరోసా వస్తుందని తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ విషయాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిలు కూటమి ప్రభుత్వంపై మోపుతున్నారని చెప్పారు. అసలు ఆదోనిలో అక్రమాలు జరిగింది, భూ కబ్జాలు జరిగింది, అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది కూడా వైసిపి హయాంలో అని వారు మర్చిపోకూడదన్నారు. ప్రజలు ఈ అక్రమార్కులు వద్దని గత ఎన్నికల్లో వైసిపిని కాదని కూటమికి పట్టం కట్టారని తెలిపారు. ఇటీవల పట్టణంలో ఎమ్మెల్యే సహచరుడైన డాక్టర్ కిరణ్ తప్పుడు ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేశారన్న విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే తన స్నేహితుడు అని కూడా చూడకుండా రిజిస్ట్రేషన్ రద్దు చేయించి చర్య తీసుకున్నారని తెలిపారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్కు పాల్పడిన అధికారులను, కారకులైన నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్, ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న, డాక్యుమెంట్ రైటర్ మాబులను, ఇంకా ఇతరులను పోలీసులు పూర్తిస్థాయిలో విచారించాలని, నిజాలను వెలుగులోకి తేవాలని కోరారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూనియన్ జిల్లా నాయకులు రమీజాబీ

ప్రజాశక్తి - దేవనకొండ

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రమీజాబీ, తులసీ, రాధిక, రాధా డిమాండ్ చేశారు. మంగళవారం దేవనకొండ పిహెచ్సిలో ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని కోరారు. అంతవరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సదుపాయాలు ఆశాలకు కల్పించాలన్నారు. 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని కోరారు. ఆశాలకు రికార్డులు, నాణ్యమైన యూనిఫారం సరఫరా చేయాలన్నారు. గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. డిఎంహెచ్ఒ సంతకంతో కూడిన గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాప్లో సమాచారాన్ని అప్లోడ్ చేయడానికి 5జి ఫోన్లు ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలన్నారు. ఎఎన్ఎం, జిఎన్ఎం పూర్తి చేసిన ఆశాలకు ఉద్యోగ సర్వీసును అప్రెంటిషిప్గా పరిగణించి ఎఎన్ఎంగా పదోన్నతి కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తు ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు నాగవేణి, అనిత, హైమావతి, నిర్మల, కమలాక్షి, కృష్ణవేణి, విజయలక్ష్మి, రాజమ్మ, కాంతమ్మ, జైనాబీ, సుజాత, లక్ష్మీ ప్రసన్న, అనసూయ, సరోజ, అరుణ జ్యోతి, మీనా, వరలక్ష్మీ, రామక్క, శివమ్మ పాల్గొన్నారు.